


నిష్పక్షపాత నిర్భయ పత్రిక

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక


మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి


బుధవారం 07-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 170 రూ॥ 6.00




# విప్లవకారిణి నుంచి రాష్ట్ర మంత్రి వరకు

## ధనసరి సీతక్క ప్రస్థానం

### ఆమె జీవిత ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం

### రాజకీయాల్లో వున్నా చదువును నిర్లక్ష్యం చేయలేదు

- న్యాయశాస్త్రంలో పట్టా
- 2022లో పీహెచ్‌డీ
- నిస్వార్థ సామాజిక సేవకు ప్రాధాన్యం
- మంత్రిగా సెక్రటేరియట్‌కు పరిమితం కాలేదు
- కోవిడ్ సమయంలో అద్భుత సేవలు
- ఈ సేవలకు జాతీయస్థాయిలో గుర్తింపు










- రేవంత్ విశ్వసించే మహిళానేత
- కేబినెట్‌లో మూడోస్థానం
- మహిళా సాధికారతకోసం నిరంతర తపన



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరిఅనసూయ (సీతక్క) జీవితం ఒక అసాధారణ పోరాటం. అడవి బాట పట్టిన విప్లవకారిణి స్థాయి నుండి చట్టసభల్లో ప్రజల గొంతుకగా, ఆపై రాష్ట్ర మంత్రిగా ఎదిగిన ఆమె ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. చిన్నతనంలోనే విప్లవ రాజకీయాల వైపు ఆకర్షితులైనప్పటికీ, సీతక్క చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. పట్టుదలతో చదివి న్యాయశాస్త్రం చదివి లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. తద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొలిటికల్ సైన్స్‌లో "తెలంగాణలోని గిరిజనుల వలసలు – సామాజిక, ఆర్థిక ఆందోళనలు (మల్టీ–స్టేక్ హోల్డర్ దఅక్పథం)" అనే అంశంపై పరిశోధన చేసి 2022లో పీహెచ్‌డీ డాక్టరేట్‌పట్టా అందుకున్నారు. సీతక్క పేరు వినగానే గుర్తిందిచ్చేది ఆమె నిస్వార్థ సామాజిక సేవ. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆమె నిరంతరం క్షేత్రస్థాయిలోనే ఉంటారు. కోవిడ్ సమయంలో ములుగు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన తండాలు, చెంచు పెంటలకు రవాణా సౌకర్యా లు లేకపోయినా.. సీతక్క భుజాలపై బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు మోస్తూ, అడవుల్లో వాగులు, వంకలు దాటుకుంటూ వెళ్లి వేలాది పేద కుటుంబాలకు కడుపు నింపారు. ఈ సేవ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. పోడు భూముల సమస్యలు, ఆదివాసీల సంస్కఅతి రక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు కోసం ఆమె నిరంతరం ఉద్యమించారు. 1980వ దశకంలో నక్సలైట్ (జనశక్తి) ఉద్యమంలో చేరి, ఆ తర్వాత 1997లో ప్రభుత్వం ప్రకటించిన సరెండర్ పాలసీ ద్వారా జనం జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఆ తర్వాత ప్రజాస్వామ్య మార్గంలో సేవ చేయాలని రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2004లో మొదటిసారి ములుగు నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు. కానీ, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో అదే ములుగు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. 2017లో రేవంత్ రెడ్డితో కలిసి ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అఖిల భారత మహిళా కాంగ్రెస్ (ఏఐఎంసీ) ప్రధాన కార్యదర్శిగా జాతీయ స్థాయిలో బాధ్యతలు నిర్వహించారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ములుగు ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుండి భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయం సాధించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అడవిలో తుపాకీ పట్టిన చేత్తో కలం పట్టి డాక్టరేట్ సా ధించి, నేడు చట్టసభల్లో ప్రజా ప్రతినిధిగా ఎదిగిన సీతక్క ప్రస్థానం సంచలనం, సాహసాల స మాహారం.

### ఓయూ నుంచి పీహెచ్‌డీ

మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) 2022 అక్టోబర్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) నుండి పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ (పీహెచ్‌డీ) పట్టా అందుకున్న సందర్భం అప్పట్లో దేశవ్యాప్తంగా ఒక సంచలనంగా మారింది. ఒకప్పుడు అడవి బాట పట్టి, ఆ తర్వాత న్యాయవాదిగా, ఎమ్మెల్యేగా మారి, చివరకు డాక్టరేట్ సాధించిన ఆమె ప్రస్థానంలోని కీలక విశేషాలీవిధంగా వున్నాయి. సీతక్క తన పీహెచ్‌డీ పరిశోధనను కేవలం థియరీ కోసమే కాకుండా, తాను నిరంతరం చూసే గిరిజన ప్రజల సమస్యలపైనే ఎంచుకున్నారు."సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ డిప్రివేషన్ ఆఫ్ మైగ్రెంట్ ట్రైబల్స్ ఆఫ్ ఈస్ట్‌వైల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ – ఎ కేస్ స్టడీ ఆఫ్ గొత్తి కోయ ట్రైబ్స్ ఇన్ వరంగల్ అండ్ ఖమ్మం డిస్ట్రిక్ట్స్" థీసిస్ పేరుతో ఈ పరిశోధన సాగింది. ఛత్తీస్‌గఢ్ వంటి సరి హద్దు ప్రాంతాల నుండి ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అటవీ ప్రాంతాలకు వలస వచ్చిన 'గొత్తికోయ' గిరిజన తెగల సామాజిక వెనుకబాటుతనం, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆమె 2012లో పరిశోధన ప్రారంభించి, 2022లో పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. తిరుపతి రావు పర్యవేక్షణలో (గైడ్?)) ఆమె ఈ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ముసలయ్య, ప్రొఫెసర్ అశోక్ నాయుడు, ప్రొఫెసర్ చందు నాయక్ గార్ల సహకారానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టరేట్ దక్కిన ఆనందంలో సీతక్క ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చేసిన పోస్ట్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంది. "నా చిన్నతనంలో నేను నక్సలైట్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. నక్సలైట్‌గా ఉన్నప్పుడు లాయర్ అవుతానని ఊహించలేదు. లాయర్‌గా ఉన్నప్పుడు ఎమ్మెల్యే అవుతానని అనుకోలేదు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పీహెచ్‌డీ చేస్తానని అస్సలు అనుకోలేదు. ఇప్పుడు మీరు నన్ను డాక్టర్ అనసూయ సీతక్క, పీహెచ్‌డీ ఇన్ పొలిటికల్ సైన్స్ అని పిలవవచ్చు. ప్రజలకు సేవ చేయడం, జ్ఞానాన్ని సంపాదించడం నా అలవాటు. నా చివరి శ్వాస వరకు దీన్ని ఆపను". 1996 ఏప్రిల్‌లో నక్సలైట్ కమాండర్‌గా ఉన్న సమయంలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో పోలీసుల కాల్పుల నుండి తలఅటిలో తప్పించుకున్న చరిత్ర సీతక్కది. కానీ 26 ఏళ్ల తర్వాత, అదే అక్టోబర్ నెలలో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ వెలుపల నలుగురు నవ్వుతూ నిలబడిన పోలీసుల మధ్య డాక్టరేట్ పట్టాతో సీతక్క ఫోటో దిగడం ఒక అద్భుతమైన సానుకూల మార్పుకు ప్రతీకగా నిలిచింది. పీహెచ్‌డీ పూర్తయిన తర్వాత కూడా సీతక్క తన చదువును ఆపలేదు. 2026 మే నెలలో ఆమె రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కాన్స్టిట్యూషనల్ లా (రాజ్యాంగ చట్టం) లో ఎల్ఎల్ఎమ్ కోర్సు చేయడానికి పీజీ లా సెట్ ప్రవేశ పరీక్షకు స్వయంగా హాజరై తన నిరంతర విద్యా కాంక్షను చాటుకున్నారు.




పూర్తి వార్త 08లో



22ND ANNIVERSARY 2004-2026

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

బుధవారం 07-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 170 రూ॥ 6.00










# "నేటిధాత్రి" ఎఫెక్ట్

## కన్నం చిన్నది..దోపిడీ పెద్దది! అనే "నేటిధాత్రి" కథనానికి కదిలిన యంత్రాంగం




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


- స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.
- వెంటనే చర్యలకు కమిషనర్ "స్టీఫెన్ రవీంద్ర" ఆదేశాలు.
- "నేటిధాత్రి" కి అధికార, మీడియా వర్గాల నుంచి అభినందనలు.

"జీవో" జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.





## "నేటిధాత్రి " కథనంతో సర్కార్‌కు రూ.1200 కోట్ల మిగులు

- ఇన్వెస్టిగేషన్ రిపోర్టింగ్ లో "నేటిధాత్రి" నెంబర్ వన్ అని మరోసారి రుజువైంది.
- 'దొడ్డు' దారిన తప్పించుకోలేరు..'సన్నాలు' పెట్టకుంటే ఊరుకునేదిలేదు!!

- కొన్న దొడ్డు బియ్యం ఏం చేసుకోము.. సన్నాలెక్కడినుంచి తేము!!
- అడుక్కునే హక్కు లేదు.. బెదిరించే దిక్కు లేదు.!
- అందిన కాడికి చేసిన దోపిడీ..కొత్త "జీవో"తో మిల్లర్ల ఉక్కిరి బిక్కిరి!
- బెదిసి కొట్టిన 'దొడ్డు' వ్యవహారం...'సన్నా'లతో కథ సమాప్తం!
- మిల్లర్ల కలలు..కొత్త "జీవో" తో కలలు కల్లలు!
- బుక్కిన సన్నబియ్యం.. కక్కనిదే వదిలి పెట్టమంటున్నా ప్రభుత్వం!
- మింగలేక కక్కలేక మిల్లర్లు కుమిలి పోతున్నారు!
- సన్న బియ్యం ఎలా అని తలలు పట్టుకుంటున్నారు!
- ప్రభుత్వం అడిగినప్పుడే బియ్యం పెడితే బాగుండేదేమో అనుకుంటున్నారు !!
- లాగి లాగి మొదటి కే మోసం తెచ్చుకున్నామని కంగారు పడుతున్నారు!
- ఇలాంటి కాలం వస్తుందని మిల్లర్లు కలలో కూడా అనుకోలేదు.
- గత పదేళ్ల కాలమే ఎల్ల కాలం సాగుతుందనుకున్నారు.
- ఎగ్గొట్టినా అడిగే దిక్కుండదని దోపిడీకి మిల్లర్లు అలవాటు పడ్డారు.
- ఆకలితో అలమటిస్తున్నామని నమ్మిస్తూ వచ్చారు.
- పిల్లి కళ్ళు మూసుకొని పాలు తగినట్టు నటించారు.
- నోట్ల కట్టలతో పదేళ్లు అందరి నోళ్లు మూయిస్తూ వచ్చారు.
- వసూళ్లు మొదలయ్యేసరికి కిరికిరి చేయాలనుకున్నారు.
- కుదరదని తెలిసినా ప్రభుత్వన్నే కావ్వించాలని చూశారు.
- బొక్క బోర్లా పడతామని మిల్లర్లు అనుకోలేదు.
- ఇలా దొరికి పోతామని అస్సలు అనుకోలేదు.

హైదరాబాద్, నేటిధాత్రి:

నేటిధాత్రి సంకల్పించిన అక్షర యజ్ఞాలెన్నో విజయవంతమయ్యాయి. ప్రజా సమస్యల మీద సాగించిన అక్షర పోరాటాలు అనేకం విజయం సాధించాయి. సమాజంలో వున్న రుగ్మతలను ప్రపంచానికి చాటినా, అన్యాయాలు, అక్రమాలపై అక్షర గాండీవాలు ఎక్కుపెట్టినా నేటిధాత్రి ముందు వరసులోవుంటుందన్న ఖ్యాతిని నేటిదాత్రి సంపాదించుకున్నది. సమాజంలో అడుగడుగునా ఎన్ని అడ్డంకులు, అవరోధాలు ఎదరైనా సరే వాటిని అదిమిస్తూ ముందుకు సాగుతోంది. అలా 22 రెండేళ్ల సుధీర్ఘ అక్షర ప్రయాణంలో తెలంగాణ ఉద్యమం కోసం తొలి అడుగులు వేసిన నేటిధాత్రి సాధించిన తెలంగాణ నిర్మాణంలో కూడా కీలకభూమిక పోషిస్తోంది. అన్యాయాలు, అక్రమాలు సహించని అక్షర రౌద్రాన్ని ప్రదర్శిస్తూ ముందకు సాగుతోంది. అవినీతిని ఎక్కడికక్కడ చీల్చి చెండాతోంది. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే మీడియాగా నేటిధాత్రికి ఒక మంచి పేరుంది. ఆపేరును మరింత ఇనుమడింపజేసేలా సాగుతున్న ప్రయాణంలో తాజాగా మరో విజయాన్ని నేటిధాత్రి తన ఖాతాలో వేసుకున్నది. తెలంగాణ మిల్లర్ల మూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి జరుగుతున్న అన్యాయాన్ని, మోసాని, దోపడిపై దశాబ్ధ కాలంగా అనేక వార్త కథనాలు రాస్తూ వస్తోంది. అలా ప్రభుత్వానికి అవసమైన అక్షర సూచనలు అందిస్తూ వుంది. సివిల్ సప్లైలో జరిగే అన్యాయాలు అక్రమాలు అనేకం వెలుగులోకి తెచ్చింది. అటు ఉద్యోగులైనా, ఇటు మిల్లర్లైనా వ్యవస్థను ఎలా ఆడుకుంటున్నారో అనేదానిపై ఎప్పటికప్పుడు ఇన్వెస్టిగేషన్ స్టోరీలు సమాజం ముందు పెడుతూనే వుంది. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు జరిగే ప్రతి ఒక్క అక్రమాన్ని వెలుగులోకి తెచ్చిన ఘనత కూడా నేటిదాత్రికే దక్కుతుందని చెప్పడం కూడా గర్వంగా వుంది. తాజాగా అలాంటి ఒక పెద్ద కుంభకోణాన్ని నేటిధాత్రి వెలుగులోకి తెచ్చింది. ఆ వార్త కథనంతో అదికారుల్లో చలనం వచ్చింది. సిఎం. రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వరకు వార్త చేరింది. సిఎం. రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్తి వ వివరాలు తెలుసుకొని, వెంటనే కొన్ని కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. అందులో తాజగా ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. మిల్లర్లు ఇలా కూడా కోట్లు సంపాదించు కుంటున్నారా? ప్రభుత్వానికి ఇలా కూడా కన్నం పెడతారా? అనే విషయాన్ని నేటిధాత్రి పూస గుచ్చినట్లు వివరించింది. ప్రభుత్వం కూడా ఒక్కసారిగా అవాక్కయింది. ఓ వైపు ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి బాకీ వున్న మిల్లర్ల బాకాయిలు చెల్లించాల్సిందిపోయి, ఎలా కోట్లు సంపాదించు కోవాలన్న పన్నాగం ఎలా పన్నుతున్నారన్నది నేటిధాత్రి వెలుగులోకి తెచ్చింది. దాని పర్యవసానంతో ప్రభుత్వానికి ఏకంగా రూ.1200 కోట్ల రూపాయలు నష్టం జరిగేలా వుంది. అలా ప్రభుత్వానికిరూపాయి నష్టం జరక్కుండా వుండేందుకు నేటిధాత్రి సన్న వడ్లు..దొడ్డు బియ్యం అనే కథనం రాసింది. చిన్న కన్నం.. పెద్ద దోపిడీ ఎలా జరుగుతుందన్నదానిపై లోతైన విశ్లేషణ నేటిధాత్రి చేసింది. దాంతో మిల్లర్ల బండారం మొత్తం బైట పడింది. ప్రభుత్వానికి ఆగ్రహం వచ్చింది. సన్న వడ్లు తీసుకున్న మిల్లర్లు సన్న బియ్యమే పెట్టాలని జీవో జారీ చేసింది. ఇంతకీ మిల్లర్లు ఏం ఎత్తుగడ వేశారంటే గత కొన్ని సీజన్లు రైతుల వద్ద నుంచి సేకరించిన వడ్లను మిల్లర్లకు ఇస్తూ వస్తున్నారు. అయితే ఇచ్చిన వడ్లను ఇచ్చినట్లే మిల్లర్లు బియ్యం చేసుకొని అమ్ముకున్నారు. ప్రభుత్వం బకాయిల వసూలు చేయాలని చూడడంతో అసలు బండారం బైట పడింది. ఇంత కాలం తాము అన్యాయమైపోతున్నామంటూ కట్టు కథలు చెప్పిన మిల్లర్ల అసలు బాగోతం నేటిధాత్రి వెలుగులోకి వచ్చింది. నెల రోజుల క్రితం వరకు మిల్లర్లు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తూ వచ్చారు. మిల్లులు మూసేసుకుం టామని బెదిరింపులకు దిగారు. ప్రభుత్వాన్ని పరోక్షంగా రెచ్చగొట్టారు. ఉన్న ఫలంగా బకాయిలు అంటే చెల్లించలేమని చేతులెత్తే శారు. మిల్లులను తనీఖీకి అదికారులు రావొద్దని మిల్లర్లు అంటూ వచ్చారు. అయితే ప్రభుత్వంతో కాళ్ల బేరానికి వచ్చిన మిల్లర్లు అందులోకూడా కొత్త ఎత్తుగడ వేశారు. సన్న బియ్యం అంటే ఇప్పటికిప్పుడు ఇవ్వలేం ఆ స్థానంలో దొడ్డు బియ్యం ఇస్తామని మాయ మాటలు చెప్పి ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే అందులో లోగుట్టును నేటిధాత్రి పసిగట్టింది. సన్న బియ్యం పెట్టక తప్పని పరిస్దితులు రావడంతో మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు విపరీతంగా పెరుతున్నాయి. బాకాయిలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వానికి ఏదోలా ఒప్పించి, దొడ్డుబియ్యం పెట్టేందుకు ఒప్పిద్దామని పధకం వేసుకున్నారు. ప్రభుత్వం కూడా మిల్లర్ల విషయంలో ఉదాసీనంగానే వుండాలని అనుకున్నది. అయితే మిల్లర్లు

## సర్కార్ "జీవో" తో మిల్లర్ల గుండె గుబేలు!

అతి తెలివి ప్రదర్శిస్తున్న సంగతిని నేటిధాత్రి వెలుగులోకి తెచ్చింది. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం మిల్లర్లు సన్న బియ్యమే పెట్టాలని జీవో జారీ చేసింది. అయితే ప్రభుత్వ పెద్దలు ఎలాగైనా ఒప్పుకుంటారన్న నమ్మకంతో మిల్లర్లు ఇతర రాష్ట్రాలనుంచి పెద్దఎత్తున దొడ్డు బియ్యం కొనుగోలు చేసుకొని తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం సన్న బియ్యమే పెట్టాలని అనుకుంటుందని ఊహించలేకపోయారు. నేటిధాత్రి అంత లోతుగా మిల్లర్ల లోగుట్టు బైట పెడుతుందని కలలో కూడా అనుకోలేదు. సన్న బియ్యమే ఖచ్చితంగా పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో మిల్లర్ల గొంతులో పచ్చి వెలక్కాయి పడినంత పనైంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి తెచ్చిన దొడ్డు బియ్యం వున్నాయి. మార్కెట్‌లో పెరిగిన సన్న బియ్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించాలంటే తడిసి మోపడౌతుంది. అత్యాశకు పోయి మొదటికే మోసం తెచ్చుకున్నామని ఆందోళన చెందుతున్నారు. నేటిధాత్రి మీద మిల్లర్లు శాపనార్ధాలు పెడుతున్నట్లు కూడ తెలుస్తోంది. మిల్లర్లు తిన్నదంతా కక్కించే పనిలో ప్రభుత్వం సీరియస్‌గా వుంది. కూడబెట్టుకున్న కోట్లు ఖర్చు చేయాలంటే మిల్లర్లకు బాధగా వుంది. ఇంత కాలం మిల్లర్లు చెప్పిన వన్నీ అబద్దాలని తేలిపోయాయి. మిల్లర్లు ఇకపై ఎలాంటి ప్రతిపాదనలతో వచ్చిన అనుమానించేలా మిల్లర్లే వాళ్ల గోతిని వాళ్లే తవ్వుకున్నారు. ఇంతకు ముందు ప్రభుత్వం మిల్లర్లపై ఎంతో ఉదాసీనంగా వుండేది. ఇప్పుడు మిల్లర్లు ఏం చెప్పినా కట్టుకథలే అని అనుమానించాల్సిన పరిస్దితిని కోరికోరి తెచ్చుకున్నారు. ఓ వైపు సీరియస్‌గా విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయి. ప్రతి గింజ లెక్క లేల్చేందుకు అదికారులు పనిచేస్తున్నారు. మిల్లింగ్‌లో జరిగే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా రికార్డులు పరిశీలిస్తున్నారు. మిల్లర్ల బండారమంతా బైట పెడుతున్నారు. ఏం జరుగుతుందో చూద్దాం!!



# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



బుధవారం 07-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 170 రూ॥ 6.00




## అంగన్వాడీ భవనంలో పెచ్చులూడి ప్రమాదం!

- స్లాబ్ పైకప్పు ఊడిపడటంతో ఐదుగురికి గాయాలు
- ముగ్గురు చిన్నారులకు గాయాలు.. ఆసిఫాబాద్ జిల్లా అంకుశాపూర్‌లో ఘటన

ఆసిఫాబాద్, నేటిధాత్రి:

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని అంకుశాపూర్ అంగన్వాడీ భవనంలో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. భవనం స్లాబ్ పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడి కింద ఉన్న వారిపై పడ్డాయి. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులతోపాటు మొత్తం ఐదుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏడాదిలో ఇందిరమ్మ టవర్స్ పూర్తి!

- లబ్ధిదారుల చేతికి ఇంటి తాళాలు
- 5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా.. 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు
- నెల ముందే పూర్తి చేస్తే రూ.45 లక్షలు.. రెండు నెలల ముందైతే రూ.90 లక్షల ప్రోత్సాహకం



హైదరాబాద్, నేటిధాత్రి:

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వేగంగా నిర్మాణాలు పూర్తి చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు.

### లక్కీ డ్రాతో 480 కుటుంబాల ఎంపిక

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తులు రాగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలినట్లు మంత్రి తెలిపారు. అర్హుల నుంచి బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

### నెల ముందే పూర్తి చేస్తే రూ.45 లక్షలు

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు కాంట్రాక్టర్లకు ఏడాది గడువు విధించినట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత గడువు కంటే ఒక నెల ముందే నిర్మాణం పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందే పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని చెప్పారు.

### మూడు విడతల్లో మరిన్ని ఇళ్లు

ప్రస్తుతం కేటాయించిన 480 ఇళ్లతో కార్యక్రమం పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు. మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. అందుబాటులో ఉన్న సుమారు 7.5 ఎకరాలతో పాటు ఇతర ప్రభుత్వ, గృహ నిర్మాణ శాఖ భూములను గుర్తించి పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామన్నారు.

### నాణ్యతకు ప్రాధాన్యం

ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పేదల సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని చెప్పారు.

### 23 నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్‌ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## కేబీఆర్ చుట్టూ ఫ్లైఓవర్లకు కొత్త డిజైన్!

- పాత పనుల ఉత్తర్వులు రద్దు.. ప్యాకేజీల్లో భారీ మార్పులు
- రూ.1,090 కోట్ల ప్రాజెక్టు వ్యయం రూ.715.16 కోట్లకు సవరణ
- జూబ్లీహిల్స్-ముఫ్ఫకం జా ఫ్లైఓవర్ పనులు మేఘాకు.. జీవో 927 జారీ



హైదరాబాద్, నేటిధాత్రి:

హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ చుట్టూ నిర్మించనున్న ఉక్కు ఫ్లైఓవర్ల ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫ్ఫకం జా ఇంజినీరింగ్ కళాశాల వరకు నిర్మించనున్న ఫ్లైఓవర్ పనులను మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించింది. గతంలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు ఇచ్చిన పనుల ఉత్తర్వులను రద్దు చేసింది.

### రూ.1,090 కోట్ల నుంచి రూ.715.16 కోట్లు

ప్యాకేజీ-1లో పనుల పరిధిని భారీగా మార్చి గతంలో నిర్ణయించిన రూ.580 కోట్ల వ్యయాన్ని రూ.365.85 కోట్లకు సవరించింది. ప్యాకేజీ-2లోనూ పనుల పరిధి, ప్రాంతాన్ని మార్చి రూ.510 కోట్ల వ్యయాన్ని రూ.349.31 కోట్లకు తగ్గించింది. మొత్తంగా రెండు ప్యాకేజీల వ్యయం రూ.1,090 కోట్ల నుంచి రూ.715.16 కోట్లకు సవరించారు.

### పాత ఆదేశాలు రద్దు

బంజారాహిల్స్, ఎన్ఎఫ్‌సీఎల్, టీవీ9 జంక్షన్లకు సంబంధించిన గత పనుల ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది. మార్పులు చేసిన ప్రతిపాదనలను ఈపీసీ కమిటీ-3 ముందు పెట్టేందుకు అనుమతి ఇచ్చింది.

### జీహెచ్ఎంసీ చర్యలకు ర్యాటిఫికేషన్

ఫ్లైఓవర్ల పనుల విషయంలో జీహెచ్ఎంసీ ఇప్పటికే చేపట్టిన చర్యలకు ప్రభుత్వం ర్యాటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీవో ఆర్టీ నంబర్ 927ను జారీ చేసింది.

## కాంక్రీట్‌తో రాజన్న గుడి.. భక్తుల విశ్వాసానికి దెబ్బ!

**ఆగమ శాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో ఆలయాన్ని నిర్మించాలి**

- నవంబర్ వరకు రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే.. లేకుంటే ఉద్యమం
- సిరిసిల్ల సెస్ అవినీతిపై విచారణ జరపాలి.. నేరెళ్ల బాధితులకు న్యాయం చేసే వరకు పోరాటం: కవిత



వేములవాడ, నేటిధాత్రి:

వేములవాడ రాజన్న ఆలయాన్ని కాంక్రీట్‌తో నిర్మిస్తూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆలస్యం అయినా సరే ఆగమ శాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో వెయ్యేళ్లు నిలిచేలా రాజన్న ఆలయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.

### రాజన్న కోడెల దుస్థితిపై ఆందోళన

కోడె మొక్కులకు ప్రసిద్ధి చెందిన వేములవాడ ఆలయంలో కోడెలు మృత్యువాత పడుతున్నా పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. సరైన పశుగ్రాసం అందించాలని, కోడెలు చనిపోతే శాస్త్ర ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేములవాడలో రహదారులు, డ్రైనేజీ, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు.

### 'నవంబర్ వరకు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే'

రాష్ట్రంలో రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు నవంబర్ వరకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. అవసరమైతే విద్యుత్‌ను కొనుగోలు చేసినా, రైతులకు సరఫరా చేయాల్సిందేనన్నారు. లేకుంటే పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

### 'సెస్ అవినీతిపై విచారణ జరపాలి'

సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థలో జరిగినట్లు ఆరోపిస్తున్న రూ.32 కోట్ల అవినీతిపై ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సెస్‌ను ప్రైవేటు సంస్థలో విలీనం చేసే ప్రయత్నాలను ఆపాలని కోరారు. సిరిసిల్ల ప్రజల దశాబ్దాల రైలు కలను సాకారం చేసేందుకు పోరాడతామని తెలిపారు.

### నేరెళ్ల బాధితులకు న్యాయం ఎక్కడ?

నేరెళ్ల బాధితుల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి న్యాయం చేయకుండా మోసం చేసిందని కవిత ఆరోపించారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం, మూడు ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### నీళ్ల కోసం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

రుద్రంగి రిజర్వాయర్ సహా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కవిత డిమాండ్ చేశారు. మిడ్ మానేర్--అప్పర్ మానేర్ అనుసంధాన పనులు పూర్తయితే లక్షా పది వేల ఎకరాలకు నీరందించే అవకాశం ఉందన్నారు.

### 'హిట్ జోడీ కాదు.. ఇడుపు కాయితం జోడీ'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌పై కవిత విమర్శలు చేశారు. వారిది 'హిట్ జోడీ' కాదని, 'ఇడుపు కాయితం జోడీ' అని వ్యాఖ్యానించారు. రైతులు, జర్నలిస్టులు, ముస్లింలు సహా అన్ని వర్గాల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.



## కరెంట్ బిల్లులతో 'వాతలు'!

- ట్రూ అప్ పేరుతో రూ.5,420 కోట్ల భారం ఎందుకు?
- విద్యుత్ ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి.. ప్రజా ఉద్యమానికి సిద్ధం: హరీశ్‌రావు

హైదరాబాద్, నేటిధాత్రి:

ఒకవైపు కరెంట్ కోతలు.. మరోవైపు పెరిగిన విద్యుత్ బిల్లులతో ప్రజలపై భారం మోపుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. దసరా, దీపావళి వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపేందుకు సిద్ధమైందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### 'రూ.5,420 కోట్లు ఎందుకు?'

విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన మొత్తాన్ని వినియోగదారుల నుంచే వసూలు చేయడం సమంజసం కాదని హరీశ్‌రావు అన్నారు. "మీరు చేసిన తప్పులకు ప్రజలు మూల్యం చెల్లించాలా?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెండు నెలల్లోనే ప్రజల నుంచి రూ.5,420 కోట్లు వసూలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు.

### 'ఇది ప్రజాపాలన కాదు.. ప్రజా పీడన'

విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని హరీశ్‌రావు ఆరోపించారు. నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని విమర్శించారు. కరెంట్ సరఫరా చేయలేని ప్రభుత్వం బిల్లులు పెంచి ప్రజల జేబులకు చిల్లులు పెడుతోందన్నారు.

### కేసీఆర్ హయాంలో భారం మోపలేదు

2016-17 నుంచి 2021-22 వరకు రూ.12,718.40 కోట్ల ట్రూ అప్ చార్జీలు విధించాలని విద్యుత్ నియంత్రణ సంస్థ సూచించినప్పటికీ, అప్పటి ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు అంగీకరించలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం మాత్రం రూ.5,420 కోట్ల భారాన్ని ప్రజలపై వేస్తున్నారని విమర్శించారు.

### 'విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసింది కేసీఆర్'

బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగంపై రూ.91 వేల కోట్లతో మౌలిక వసతులను బలోపేతం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,450 మెగావాట్లకు పెంచామని చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచామని పేర్కొన్నారు.

### 'కోతలకు కాంగ్రెస్ వైఫల్యమే కారణం'

ప్రస్తుతం రాష్ట్రంలో కరెంట్ కోతలు, తక్కువ వోల్టేజీతో రైతులు, పారిశ్రామిక రంగం ఇబ్బందులు పడుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. "ఎల్‌నినో కరువు కాదు.. కాంగ్రెస్ కరువు" అని వ్యాఖ్యానించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించలేకపోతున్నారని విమర్శించారు.

### ప్రైవేటీకరణపైనా మండిపాటు

ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. టీజీ-ట్రాన్స్‌కో, టీజీ-జెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

### 'భారం వెనక్కి తీసుకోకుంటే ప్రజా పోరాటం'

ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.5,420 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరో ప్రజా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

## కేటీఆర్ పాస్‌పోర్టుపై 'ఈనాడు' వార్తకు లీగల్ నోటీసు!

- కోర్టు జప్తు ఆదేశించిందన్న వార్త వాస్తవ విరుద్ధమని అభ్యంతరం
- 48 గంటల్లో వార్త ఉపసంహరణ.. సవరణ, బేషరతు క్షమాపణకు డిమాండ్



హైదరాబాద్, నేటిధాత్రి:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాస్‌పోర్టును తాత్కాలికంగా జప్తు చేయాలని ప్రత్యేక కోర్టు ఆదేశించినట్లు సెప్టెంబర్ 29న ప్రచురితమైన వార్తపై కేటీఆర్ తరఫు న్యాయవాది ఎన్. లలితారెడ్డి 'ఈనాడు'కు లీగల్ నోటీసు జారీ చేశారు. ఆ వార్త వాస్తవాలకు విరుద్ధంగా, పాఠకులను తప్పుదోవ పట్టించేలా ఉందని నోటీసులో పేర్కొన్నారు.

### మెమోనే.కోర్టు ఉత్తర్వు కాదంటూ

ఏసీబీ దర్యాప్తు అధికారి కేటీఆర్ పాస్‌పోర్టుకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రత్యేక కోర్టులో మెమో దాఖలు చేశారని, దానిని కోర్టు ఉత్తర్వుగా ప్రచురించడం సరికాదని న్యాయవాది పేర్కొన్నారు. పాస్‌పోర్టును తాత్కాలికంగా జప్తు చేయాలని ప్రత్యేక కోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని నోటీసులో స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఏసీబీ పాస్‌పోర్టు సమర్పించాలని కోర్టును కోరినట్లు ఇతర వార్తా కథనాలు కూడా పేర్కొన్నాయి.

### ఆర్‌పీఓ షోకాజ్ నోటీసు

సెప్టెంబర్ 28న హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పాస్‌పోర్టుల చట్టంలోని సెక్షన్ 10(3)(వ) కింద షోకాజ్ నోటీసు జారీ చేసి, వివరణ ఇచ్చేందుకు 15 రోజుల గడువు ఇచ్చిందని కేటీఆర్ తరఫు న్యాయవాది తెలిపారు.

### 48 గంటల గడువు

వార్తకు ఆధారమైన మూలాలు, పత్రాలు, రికార్డులను వెల్లడించాలని నోటీసులో కోరారు. ప్రచురితమైన వార్తను ఉపసంహరించుకుని అదే ప్రాధాన్యంతో సవరణ ప్రచురించాలని, బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్, ఈ-పేపర్, వెబ్‌సైట్, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ భద్రపరిచిన ప్రతుల్లోనూ సవరణ చేయాలని కోరారు. 48 గంటల్లో స్పందించకపోతే పౌర, క్రిమినల్ పరువునష్టం చర్యలతోపాటు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆశ్రయిస్తామని నోటీసులో హెచ్చరించారు.

# బీఆర్ఎస్‌కు మళ్లీ జోష్!

- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. కేసీఆర్‌పై అభిమానం పెరుగుతోంది
- పట్టభద్రుల ఓటర్ల నమోదును ముమ్మరం చేయాలి: ఎంపీ వద్దిరాజు

భద్రాద్రి కొత్తగూడెం, నేటిధాత్రి:

కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సుపరిపాలనను కోల్పోయినందుకే రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయన్న భావన ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతోందన్నారు. కేసీఆర్ మహానేత, గొప్ప పాలనాదక్షుడని, ఆయనపై ప్రజల్లో అభిమానం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

### పట్టభద్రులపై ప్రత్యేక దృష్టి..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల వద్దకు స్వయంగా వెళ్లి ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను మరింత ముమ్మరం చేయాలని సమన్వయకర్తలకు సూచించారు. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లోనే కాకుండా ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



### కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో అసంతృప్తి

గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుల హామీలను నమ్మి మోసపోయినట్లు ప్రజలు భావిస్తున్నారని రవిచంద్ర అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన మూడేళ్లకు చేరువవుతున్నా తమకు ఒరిగిందేమీ లేదన్న అసంతృప్తి అన్ని వర్గాల్లో ఉందన్నారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో కేసీఆర్‌పై అభిమానాన్ని భక్తులు పాటల రూపంలో చాటిచెప్పారని, బతుకమ్మ, దసరా పండుగల్లోనూ ఇదే అభిమానం మరోసారి వ్యక్తమవుతుందని అన్నారు.

### ప్రముఖుల హాజరు..

సమావేశంలో ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధుసూదన్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అశ్వారావుపేట, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాల నాయకులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు.

### నినాదాలతో దద్దరిల్లిన తెలంగాణ భవన్

"జై తెలంగాణ.. జైజై తెలంగాణ", "జిందాబాద్.. జిందాబాద్.. బీఆర్ఎస్ జిందాబాద్", "వర్ధిల్లాలి.. వర్ధిల్లాలి.. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినదించడంతో తెలంగాణ భవన్ పరిసరాలు మార్మోగాయి.

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు రాజీనామా నిర్ణయం!?



భద్రాద్రి కొత్తగూడెం, నేటిధాత్రి:

బీఆర్ఎస్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో షాక్ తగిలింది. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గులాబీ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో తన అనుచరులతో చర్చించి అధికారికంగా రాజీనామా ప్రకటన చేస్తానని తెలిపారు.

### నాయకత్వంపై అసంతృప్తి

బీఆర్ఎస్‌లో తనకు తగిన గౌరవం లభించడం లేదని తాటి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గౌరవం లేని చోట తాను కొనసాగలేనని పేర్కొంటూ పార్టీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### గతంలో కాంగ్రెస్‌లోకి.. మళ్లీ బీఆర్ఎస్‌లోకి

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌పై అసంతృప్తితో తాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌లో చేరారు. అయితే అక్కడ టికెట్ దక్కకపోవడంతో తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారు. తాజాగా మరోసారి పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు.

# ఆడబిడ్డ అంశంపై రాజకీయం చేస్తే ఖబడ్దార్!



- ఎమ్మెల్యే నాగరాజుపై విష ప్రచారం సరికాదు
- న్యాయం కోసం నిలబడితే తప్పేంటి?.. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలా?
- దళిత యువతికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం: తుళ్ల రవి

**వర్ధన్నపేట, నేటిధాత్రి:**
వర్ధన్నపేట మండలంలో దళిత యువతికి సంబంధించిన వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకుంటూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై కొందరు విపక్ష నాయకులు, బీఆర్ఎస్ నేతలు, ఆర్ఎస్ ప్రవీణ్ బృందానికి చెందిన వారు విష ప్రచారం చేస్తున్నారని వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు తుళ్ల రవి ఆరోపించారు. యువతికి జరిగిన అన్యాయంపై న్యాయం కోసం ఎమ్మెల్యే స్పందిస్తే దానిని రాజకీయ అంశంగా చిత్రీకరించడం సరికాదని ఆయన మండిపడ్డారు.
ఆడబిడ్డ సమస్య ఏమిటో ముందుగా ఆమెను అడిగి తెలుసుకోవాలని, ఎమ్మెల్యే నాగరాజు ఈ వ్యవహారంలో ఏం చేశారో తెలుసుకోకుండా నోటికొచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదని తుళ్ల రవి అన్నారు. దళిత యువతికి న్యాయం జరగాలన్నదే ఎమ్మెల్యే ఉద్దేశమని, బాధితురాలికి అండగా నిలబడటమే తప్పా? అని ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తే దానినే రాజకీయ అస్త్రంగా మార్చుకుని ఎమ్మెల్యేపై బురదజల్లడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.
పేదలు, మహిళలు, దళితుల సమస్యలపై స్పందించే ప్రజాప్రతినిధులపై ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని తుళ్ల రవి పేర్కొన్నారు. ప్రతి అంశంపై ఎమ్మెల్యే వెంటనే మీడియా ముందుకు వచ్చి ప్రకటన చేయాల్సిన అవసరం లేదని, అందుబాటులో ఉన్న సమాచారం, సంబంధిత వ్యక్తుల వాదనలు, పార్టీ స్థాయిలో తీసుకునే నిర్ణయాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.
వాస్తవాలు తేలకముందే తీర్పులా? యువతి చేసిన ఆరోపణలు ఒకవైపు, ఎమ్మెల్యే వర్గం వివరణ మరోవైపు ఉండగా, విపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయని తుళ్ల రవి అన్నారు. అన్ని వర్గాల వాదనలు పూర్తిగా బయటకు వచ్చిన తర్వాతే వాస్తవ పరిస్థితి తెలుతుందని పేర్కొన్నారు. అంతవరకు ఆరోపణలనే తీర్పులుగా చిత్రీకరిస్తూ రాజకీయ ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. రాజకీయ లాభం కోసం ఆడబిడ్డ సమస్యను ఉపయోగించుకోవద్దని, ఆమెకు న్యాయం జరగడమే అందరి ప్రధాన లక్ష్యం కావాలని తుళ్ల రవి స్పష్టం చేశారు. దళిత యువతికి న్యాయం జరిగే వరకు ఎమ్మెల్యే నాగరాజు అండగా ఉంటారని, బాధితురాలి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



# బాధిత యువతికి అండగా ఉంటా

- ప్రేమ పేరుతో మోసపోయిన దళిత యువతికి న్యాయం చేయాలి
- న్యాయం చేయకుంటే పెద్దఎత్తున నిరసన.. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట, నేటిధాత్రి:
వర్ధన్నపేట మునిసిపల్ చైర్మన్ కుమారుడి చేతిలో మోసపోయినట్లు ఆరోపిస్తున్న దళిత యువతికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. బాధిత యువతి న్యాయం కోసం కొనసాగిస్తున్న నిరసన విషయం తెలుసుకున్న ఆయన, వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్‌తో కలిసి అక్కడికి చేరుకుని ఆమెకు సంఘీభావం తెలిపారు.
తనకు అన్యాయం జరిగిందని యువతి పలుమార్లు న్యాయం కోసం కోరినా పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని కొండేటి శ్రీధర్ ప్రశ్నించారు. ప్రేమ పేరుతో మోసపోయిన యువతికి న్యాయం చేయాలని, మునిసిపల్ చైర్మన్ కుమారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరగకపోతే పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్ తదితరులు పాల్గొని బాధిత యువతికి సంఘీభావం తెలిపారు.

# హైకోర్టు స్టే గౌరవించని అధికారులు



భూపాలపల్లి నేటిధాత్రి :
జయశంకర్ భూపాలపల్లి కేంద్రం అంబేద్కర్ సెంటర్ చిరు వ్యాపారుల డబ్బాలను భూపాలపల్లి మునిసిపాలిటీ అధికారులు కూల్చివేసిన అడ్డ డబ్బాల ఆవరణలో బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి అయినటువంటి చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారులకు హైకోర్టు ఇచ్చిన తీర్పు స్టే ప్రకారంగా అధికారులు సహకరించాలని అన్నారు 2014లో భూపాలపల్లి మునిసిపాలిటీ అయినప్పటి నుంచి ఇదివరకు గతంలో అధికారంలోకి వచ్చిన బి ఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గాని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గాని భూపాల పెల్లి మునిసిపాలిటీ అభివృద్ధి పేరుతో ప్రైవేట్ స్థలాల వ్యక్తులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు దండుకొని విలువైన స్థలాలను కబ్జా చేస్తూ సింగరేణి స్థలాలలో ఉండబడినటువంటి నిరుపేద చిరు వ్యాపారస్తుల అద్దాలను దౌర్జన్యంగా తొలగించడం జరుగుతుంది ఎలాంటి రూట్ మ్యాప్ లేకుండా రోడ్ల అభివృద్ధి పేరుతోనే నిరుపేద అడ్డాల వ్యాపారస్తుల దగ్గర అవినీతికి పాల్పడుతూ దౌర్జన్యంగా వారి మీద దాడులు చేస్తూ నిరుపేదల ఇళ్లను అడ్డాలను బలవంతంగా తొలగించడం జరుగుతున్నది ఇటువంటి విషయశీ అదే పద్ధతి కొనసాగుతున్నది అంతే కాకుండా గత మూడు రోజుల నుంచి అధికార కాంగ్రెస్ పార్టీ మునిసిపాలిటీ అధికారులు పోలీసు యంత్రాంగం ప్రజల మీద ఉక్కు పాదం మోపి భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ కూడా మా బిజెపి నాయకులు, కార్యకర్తలు మా బిఎంఎస్ నాయకులు కార్యకర్తలు అదేవిధంగా అఖిలపక్ష చిరు వ్యాపారులంతా ఏకమై కూడా నిరాహార దీక్షలు చేస్తూ నిరసన తెలియజేయడం జరుగుతున్నది అయినప్పటికీ కూడా ఎలాంటి రూట్ మ్యాప్ లేకుండా కలెక్టర్ ఆదేశాలు లేకుండా విచ్చలవిడిగా మునిసిపాలిటీ చైర్మన్ ఎమ్మెల్యే పోలీస్ యంత్రాంగము మూకుమ్మడిగా చిరు వ్యాపారుల మీద భూపాలపల్లి ప్రజల మీద ఒక దండయాత్ర కొనసాగిస్తా ఉన్నారు. ఈ భూపాలపల్లిలో జరిగే దమన కాండను పూర్తిగా నేను ఖండిస్తున్నాను ఇక్కడున్న చిరు వ్యాపారులకు అడ్డాలు కోల్పోయినటువంటి నిరుపేదలందరికి కూడా బిజెపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మద్దతు చేయడమే కాదు ఈ పోరాటంలో ముందుండి ఎంతటికైనా నిలబడి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దౌర్జన్యాలను అడ్డాలు కోల్పోయిన వాళ్ళందరికీ అక్కడే పునరావాస కల్పించే అంతవరకు కూడా పోరాటం చేస్తానని తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నిశిధర్ రెడ్డి జిల్లా ఇన్చార్జ్ దశమంత రెడ్డి వెన్నంపల్లి పాపయ్య మొగిలి నాయకులు దొంగల రాజేందర్ గీసా సంపత్ కుమార్ అర్బన్ అధ్యక్షులు బట్టు రవి ఎ రక ల గణపతి మీనం తిరుపతి గట్ల శ్రీను రాజేందర్ పాల్గొన్నారు

# కార్మికుల హక్కుల కోసం ఐక్యకూటమిని గెలిపించాలి

- ఆర్టీసీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి
- కార్మికుల భవిష్యత్, సంక్షేమానికి ఇవి కీలక ఎన్నికలు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హనుమకొండ, నేటిధాత్రి:
ఆర్టీసీ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా పోరాడే ఐక్యకూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.
ఆర్టీసీ సంస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని నాగరాజు అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజలకు సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడే సంఘాలకు అండగా నిలవాలని కోరారు.
కార్మికుల గొంతుకగా నిలిచే నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ఆర్టీసీలో మరింత మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ఎన్నికలను కేవలం సంఘాల మధ్య పోటీగా కాకుండా కార్మికుల భవిష్యత్, హక్కులు, సంక్షేమానికి సంబంధించినవిగా భావించాలని సూచించారు. ప్రతి కార్మికుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించి ఐక్యకూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.
ఈ ఎన్నికల సభలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# హుండీ లెక్కింపుపై రగడ!

- కాశీబుగ్గ పోచమ్మ ఆలయం వద్ద పూజారుల నిరసన
- మాజీ కార్పొరేటర్ జోక్యంతోనే లెక్కింపు నిలిచిపోయిందని ఆరోపణ



వరంగల్, నేటిధాత్రి:
వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 19వ డివిజన్ కాశీబుగ్గ పోచమ్మ ఆలయంలో హుండీ లెక్కింపుపై వివాదం తలెత్తింది. పోచమ్మ బోనాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హుండీని లెక్కించేందుకు ఎండోమెంట్ అధికారులు రాగా, లెక్కింపు జరగకుండా అడ్డుకున్నారని ఆలయ పూజారులు ఆరోపించారు.
అధికార పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ జోక్యంతోనే అధికారులు వెనుదిరిగారని పూజారులు పేర్కొన్నారు. దీంతో హుండీ లెక్కింపు నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఆయన ఇంటి ఎదుట పూజారులు బైఠాయించారు. ఆలయ వ్యవహారాల్లో ఇతరుల జోక్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆలయం ఎండోమెంట్ పరిధిలో ఉన్నందున నిబంధనల ప్రకారం హుండీ లెక్కింపు చేపట్టాలని పూజారులు, భక్తులు, కాశీబుగ్గ వాసులు కోరారు. ఈ వ్యవహారంపై ఎండోమెంట్ ఈవో స్పందించి, ఆలయ వ్యవహారాల్లో జోక్యాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి

## గవర్నర్ కోటాలో అవకాశం కల్పించాలి

### మాదిగలతోపాటు పేదలు, దళిత-బహుజన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుంది: తాళ్లపల్లి జాన్సన్

హనుమకొండ, నేటిధాత్రి:
గవర్నర్ కోటాలో ప్రముఖ వైద్యులు, ప్రజాసేవకులు డా. పెరుమాండ్ల రామకృష్ణ మాదిగకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ తాళ్లపల్లి జాన్సన్ కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలకు ఈ విజ్ఞప్తి చేశారు.
కాంగ్రెస్‌లో సుదీర్ఘ ప్రస్థానం: ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన డా. రామకృష్ణ ఎన్నో ఏళ్లుగా పార్టీలోనే కొనసాగుతూ ప్రజా సమస్యలు, దళిత-బహుజన సంక్షేమం కోసం పనిచేస్తున్నారని జాన్సన్ తెలిపారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం 30 మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఆయనకు మద్దతుగా సిఫారసు లేఖలు ఇచ్చారని పేర్కొన్నారు.
పార్టీ మారకుండా కాంగ్రెస్‌లోనే: గత ప్రభుత్వ హయాంలో ఎన్నో కేసులు ఎదురైనా పార్టీ మారకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగారని తెలిపారు. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోయినా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి టికెట్ వచ్చినప్పుడు ఎంత కష్టపడతారో అదే స్థాయిలో పనిచేశారని పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను కాంగ్రెస్ నాయకత్వం గుర్తించాలని కోరారు.
'పేదోళ్ల డాక్టర్'గా గుర్తింపు: రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలు, బలహీన వర్గాలకు నిరంతరం వైద్య, సామాజిక సేవలు అందిస్తూ 'పేదోళ్ల డాక్టర్'గా గుర్తింపు పొందారని జాన్సన్ తెలిపారు. ప్రజాసేవకు అంకితమై హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలోని ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్నారని చెప్పారు. ఆయన సేవలకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయితోపాటు విదేశాల నుంచి కూడా పలు సామాజిక సేవా పురస్కారాలు లభించాయని పేర్కొన్నారు.



రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుంది: వైద్య రంగంలో అనుభవంతోపాటు ప్రజా సమస్యలపై ఉద్యమకారుడిగా, దళిత-బహుజన వర్గాల గొంతుకగా డా. రామకృష్ణ పనిచేస్తున్నారని జాన్సన్ అన్నారు. ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే మాదిగలతోపాటు పేదలు, దళిత-బహుజన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లభించినట్లవుతుందని తెలిపారు.
సేవలు, నిబద్ధతను గుర్తించాలి: డా. పెరుమాండ్ల రామకృష్ణ ప్రజాసేవ, వైద్య సేవలు, కాంగ్రెస్ పార్టీ పట్ల చూపిన నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను తాళ్లపల్లి జాన్సన్ కోరారు.

# బతుకమ్మ.. విజయదశమికి పటిష్ట ఏర్పాట్లు

- ఐదు నుంచి ఆరు వేల మందికి ఏర్పాట్లు, శాఖల సమన్వయంతో వేడుకలు.
- మాజీ మంత్రి, తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ.



వరంగల్, నేటిధాత్రి:
బతుకమ్మ నవరాత్రులు, విజయదశమి వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా, వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉర్సు రంగలీల మైదానంలో వేడుకల ఏర్పాట్లపై పోలీసు కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ టి.వెంకన్న, రెవెన్యూ అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.
బతుకమ్మ నవరాత్రుల సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు, వైద్య సేవలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కొండా సురేఖ సూచించారు. తొమ్మిది రోజుల పాటు సంచార మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలని, ప్రతిరోజూ కార్యక్రమాలు ముగిసిన వెంటనే వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

### ఐదు నుంచి ఆరు వేల మందికి ఏర్పాట్లు

విజయదశమి సందర్భంగా రాంలీలా మైదానంలో నిర్వహించే రావణ వధ కార్యక్రమానికి సుమారు ఐదు వేల నుంచి ఆరు వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత రెండేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రత, రాకపోకల నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు, వైద్యం, అగ్నిమాపక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రహదారులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ అధికారులను కోరారు.

### రాకపోకలపై పోలీసుల దృష్టి

పోలీసు కమిషనర్ శ్వేత మాట్లాడుతూ గతంలో నిర్వహించిన బతుకమ్మ, దసరా ఉత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రాకపోకల మళ్లింపు, ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఇందుకు ఉత్సవ కమిటీ సహకరించాలని కోరారు.

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు, రాకపోకలు తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధ్వని నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. దసరా రోజున ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, పర్యాటక శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



### చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు

ఉత్సవాలకు వచ్చే చిన్నారులు తప్పిపోకుండా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నంబరుతో కూడిన గుర్తింపు పట్టీని చిన్నారుల చేతికి స్నేహబంధం తరహాలో ఏర్పాటు చేస్తే, తప్పిపోయిన సందర్భంలో వారిని తల్లిదండ్రులకు సులభంగా అప్పగించేందుకు వీలుంటుందని తెలిపారు.
ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు.

### ఏర్పాట్ల సమావేశానికి "కుడా ఛైర్‌పర్సన్" దూరం!

బతుకమ్మ, విజయదశమి వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశానికి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ శ్వేత, గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ టి.వెంకన్న, రెవెన్యూ అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు. అయితే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి సమావేశానికి హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.
వేలాది మంది ప్రజలు పాల్గొనే బతుకమ్మ, విజయదశమి వేడుకల ఏర్పాట్లపై కీలక సమావేశం జరుగుతున్న సమయంలో కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి దూరంగా ఉండటంపై అధికార, రాజకీయ వర్గాల్లో చర్చ సాగింది. నగర పరిధిలో జరిగే ప్రధాన వేడుకల ఏర్పాట్లలో వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయం అవసరమైన నేపథ్యంలో ఆమె గైర్హాజరు కావడం పలువురి దృష్టిని ఆకర్షించింది. అయితే ఆమె సమావేశానికి హాజరుకాకపోవడానికి కారణాలు అధికారికంగా వెల్లడికాలేదు.
సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్.కిషోర్‌కుమార్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు వై.వి.గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్ రెవెన్యూ డివిజనల్ అధికారి సుమ, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల్ నవీన్‌రాజు, అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మెడిది మధుసూదన్, కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, సంయుక్త కోశాధికారి వెలిది శివమూర్తి, ఉత్సవాల నిర్వాహకుడు వొడ్నాల నరేందర్, ట్రస్టు చైర్మన్ వంగరి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి



- గవర్నర్ కోటాలో మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి
